# మళ్ళీ కాశీకే

రచన: కొండేపూడి సూర్యకామరాజు

"అమృతం! ఈరాత్రే నా కాశీ ప్రయాణం.

"ఈ రాత్రే?"

"అవును యీ రాత్రే బయలుదేరాలి. ఆలస్యంచేస్తే సీటు దొరకదు."

"అయితే వెళ్ళిరా. పరీక్ష ప్యాసవాలి సుమా."

"పరీక్ష ఫేలవుతే నన్ను పెండ్లాడవు కావాల్సు."

"ఏమయినా సరే. నినుతప్ప మరొకర్ని..."

రెండేళ్ళ క్రితం తనకూ, తన మేనకోడలు అమృతవల్లికీ జరిగిన సంభాషణ అది. హనుమంతం ఆ సంభాషణే ఆలోచిస్తూ కూర్చున్నాడు రైల్లో. అమృతవల్లికి ఎంత ప్రేమ! తనంటే. ఎంత సంతోషిస్తుందో తను వెళ్ళగానే. తను అమృతవల్లి మెడలో మంగళసూత్రం ముడివేస్తోన్నప్పుడు ఆమె ముఖ చిహ్నలను చూడాలని ఎంతో అభిలాష. ఆ సమయం దగ్గరపడుతోన్నందుకు ఉప్పొంగిపోతున్నాడు హనుమంతం. రైలు గోదావరి బ్రిడ్జి దాటుతూవుంటే కలిగిన ధ్వని అతడి పెళ్ళినాటి మంగళధ్వనులవలె వుందతడికి — ఈ ఆలోచనలతోటే రైలు గోదావరిష్టేషనులో ఆగింది.

"ఆ బెడ్డింగు కొంచెం క్రిందపెడతారూ?" హనుమంతాన్ని అడిగాడు అప్పుడే యెక్కిన పెద్దమనిషి. మాట్లాడకుండా బెడ్డింగు తీసి క్రింద పెట్టాడు హనుమంతం. ఆ యేర్పడిన ఖాళీలో తనతో తీసుకవచ్చిన అమ్మాయిని కూర్చోపెట్టి అప్పరుబెర్తుమీదకు యెక్కి శేషతల్పశాయి పోజు యిచ్చాడు ఆ పెద్దమనిషి. ఆ అమ్మాయి మాత్రం అక్కడే కూర్చొని తన వడిలోని చంటిబిడ్డను ముద్దాడుతూవుంది.

ఆ మాతా శిశువుల్నిచూస్తే హనుమంతానికి యెంతో సంతోషమేసింది. "తన అమృతవల్లి కూడా అట్లాగే ముద్దాడుతుందేమో తనకు కుమారరత్నం వుద్భవించాక" అనుకున్నాడు మనస్సులో, రైలు మళ్ళీ తనప్రయాణాన్ని సాగిస్తూనే వుంది. హనుమంతం ఆలోచిస్తూనే వున్నాడు అమృతవల్లినిగురించి. ఆమె వడిలోని పాపాయిమాత్రం 'తాత, తాత' అని వచ్చీరాని మాటల్తో అంటోంది.

"తాత కాశీ వెళ్ళాడమ్మా చదువుకోటానిక్కి. ఈవాళో రేపో వస్తాడు" అంది ఆ అమ్మాయి తన భాష ఆ నోరెరుగని పశికూన కర్థమవుతున్నట్లు.

హనుమంతం ఆలోచన కంతరాయంకలిగింది.

"అమృతం!"

"మామయ్యా!"

నీరయిపోయాడు హనుమంతం. ఒక్క క్షణం క్రిందటివరకు ఎన్ని ఆశాసౌధాలు నిర్మించాడు! 'మామయ్యా' అని ఆమె అన్నమాట అతని అనంత ఆశాసౌధాలపాలిట ఏటంబాంబయింది.

'మామయ్యా' మళ్ళీ పలకరించింది.

"ఏమమ్మా" అన్నాడు. అతని దుఃఖాన్ని మరుగుపర్చుకుంటూ.

"ఇదేనా రావడం కాశీనుంచి? పరీక్షలయ్యాయా?"

"ఆ, అన్నీ అయిపోయాయి" అన్నాడు నిరాశతో కూడిన వెచ్చటి వూపిరివిడుస్తూ.

"ఏం. అట్లావున్నావేం? బాగారాశావా?"

"బాగానే రాశాను-ఏదీపాప నిట్లాయియ్యి" అన్నాడు తన బలహీనతను పాపాయి ముద్దులాటలో కప్పి పుచ్చుకోడానికి.

"ఈపాప యెవరో తెలుసా" పాపాయిని అందిస్తూ అంది.

"అవును, అర్థమయింది. ఈ పాపకు నేను 'తాత' నవుతాను."

'తాత' అంటూ హనుమంతం ముక్కుపట్టుకు ఆడిస్తోంది. ఏడునెలలయినా నిండని ముద్దుపాప.

"మావయ్యా-ఆయన్ని పిలవనా?"

"వద్దు-నిద్రపోతున్నట్టున్నారు లేపకు."




COME TO US
FOR THE ANSWER
WE HAVE EXPERT STAFF
IN OUR REPAIRING
DEPARTMENT
JALAL & SONS
RATTAN BAZAAR, MADRAS.

Branches { Mount Rd., Madras.
Abid Rd. Hyderabad (Dn.)
Kingsway, Secunderabad (Dn.)

"మామయ్యా! మా అత్తవారిది యేవూరో తెలుసా?-రాజమండ్రీయే!"

"పాపా! నేను నీకేమవుతానో తెలుసా?"

"తాత" అంది మళ్ళీ ఆ పశికూన.

రైలాగింది ద్వారపూడి స్టేషన్లో.

"అమృతం! పాప నొకసారి తీసుకో."

"మామయ్యా! నాకేమి తీసుకొచ్చావు కాశీనుంచి?" పాపను తన వడిలోకి తీసేసుకుంటూ అడిగింది.

"ఆ హోల్డాల్లో వున్నాయి తీసుకో."

నిముషంలో హోల్డాల్లో వున్న చీరెలు, రిబ్బన్లు, ఫేసుపౌడరు డబ్బాలు మొదలైనవన్నీ తీసి బయటపెట్టింది. అమృతవల్లి.

"మామయ్యా! ఈ చీర నేను కట్టుకుంటే ఎంతో అందంగా వుంటాను కాదూ?" బెనారసు సిల్కు చీరెమతీసి అడిగింది.

"........."

"ఏం మామయ్యా?" జవాబుకోసం తల పైకెత్తింది.

"ఏడీ మామయ్య!" తలుపుదగ్గరకొచ్చి కిటికీలో తలపెట్టి చూసింది.

"దిగిపోయావేం మామయ్యా?"

ప్లాటుఫారంమీద తల వంచుకొని అట్లాగే నిలబడ్డాడు. హనుమంతం. ప్లాకాటు వెల్తురులో కూడా అతని కన్నీటిని స్పష్టంగా చూసింది. అమృతవల్లి "మామయ్యా" పిచ్చికేక పెట్టింది. అతడుమాత్రం తలెత్తలేదు.

"మామయ్యా! అదేమిటి, ఈ రాత్రివాళ యిక్కడ దిగావు ఎక్కడికెడుతావ్?"

"మళ్ళీ కాశీకే!" తల కొంచెం పైకెత్తి ప్రశాంతంగా జవాబిచ్చాడు, హనుమంతం.

ఇంజను తనకున్న శక్తినంతా వినియోగించి అక్కడనుండి అమృతవల్లిని లాక్కుపోయింది. ఎదురుగా కదలని వృక్షాలను, దూరంగా కనపడే కొండల్ని చూస్తూ నిలబడిపోయాడు హనుమంతం. "మళ్ళీ కాశీకే" అనుకున్నాడు మరొక్కసారి.